# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 10, నవంబర్ 2025


## గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

**ఆసిఫాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త**

మండలంలోని ఇప్పల్ నవేగాం బస్ స్టాప్ వద్ద అక్రమంగా గుడంబా రవాణా చేస్తున్న వ్యక్తిని ఆదివారం ఉదయం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పల్ నవేగాం గ్రామానికి చెందిన చిలుకయ్య అక్రమంగా గుడుంబాను తరలిస్తున్న సమయంలో టాస్కర్ఫ్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుకొన్నారు. ఈ దాడిలో మొత్తం 10 లీటర్ల గుడుంబా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్యానికి హానికరమైన అక్రమ గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై కందూరి, హెడ్ కానిస్టేబుల్ మహ్మద్, కానిస్టేబుల్ సంజీవ్, దేవేందర్లు పాల్గొన్నారు.



# నాడు పచ్చని స్వప్నం...

# నేడు ఎండిపోతున్న జ్ఞాపకం..!



- ✶ కొమురం భీం జిల్లాలో నీరు లేక నిర్వీర్యంగా పల్లె ప్రకృతి వనాలు
- ✶ నిధులు లేక నిర్వహణ కరువు ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి సంరక్షించాలి



**పెంచికల్‌పేట్, నవంబర్ 09, ప్రభాతవార్త :**

గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో స్థాపించబడిన పల్లె ప్రకృతి వనాలు ఒకప్పుడు గ్రామాలకు పసిడిపచ్చని ఉపిరిలా నిలిచాయి. కానీ ప్రస్తుతం ఇప్పుడు చాల గ్రామాల్లో నీటి కొరత, నిధులలేమి, నిర్వహణ లోపం కారణంగా ప్రకృతి వనాల పరిస్థితి నాటి పచ్చని స్వప్నం నేడు ఎండిపోతున్న జ్ఞాపకంగా మారుతుంది.పల్లె ప్రకృతి వనాలు పర్యావరణ సమత్యుల్యతను కాపాడుతూ పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ స్థాయిల పెంపు, ప్రజలకు ప్రకృతి అందాల మధ్య విశ్రాంతి వాతావరణం కల్పించడం, వర్షాభావ పరిస్థితుల్లో సహజ నీటి నిల్వలను రక్షించడం, ప్రజల్లో పర్యావరణం చైతన్యం పెంపుదల వంటి లక్ష్యాలతో పచ్చ తెలంగాణ మిషన్ నిధులు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్ ) నిధులు, గ్రామా పంచాయతీ నిధుల ద్వారా పుష్పవనాలు, నీటి వనరుల ఏర్పాటు, కూర్చునే బెంచీలు, సౌర దీపాలు, కాపౌండ్ గోడలు వంటి మోలిక సదుపాయాలకు భారీగా ఖర్చు పెట్టి పర్యావరణ రక్షణకు చిహ్నాలుగా పల్లె ప్రకృతి వనాలను నిర్మించారు.

2లో..

## పడకేసిన పారిశుధ్యం..

# ఎక్కడి చెత్త అక్కడే..!

**తాండూర్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

మండలంలోని కార్మిక క్షేత్రమైన మాదారం టౌన్ షిప్ లోని పలు ప్రాంతాలు, రోడ్లు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధం పడకేసింది. గతంలో మాదారంలో 17 మంది సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేయడం వలన రోడ్లు, కార్మిక వాడలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవి. గత కొన్ని రోజుల నుంచి ఆరుగురు సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో సంబంధిత సింగరేణి అధికారులు కొన్ని ప్రాంతాలలోనే పారిశుధ్య పనులను చేయిస్తున్నారు. సింగరేణి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్మికేతర కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతాలలో స్థానిక సింగరేణి సివిల్ అధికారులు పారిశుధ్య పనులను చేయించడం లేదు. సింగరేణి అధికారులు, గ్రామ పంచాయతీ అధికారుల మధ్య పారుశుధ్య పనులపై సమన్వయం లోపించి కొన్ని ప్రాంతాలలో మిగతా 2లో..





## సింగరేణి అధికారుల సమస్యల పై

# సానుకూలంగా స్పందించిన సీ అండ్ ఎం.డీ

★ సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డీ పంతులా

**జైపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త**

సింగరేణి పవర్ ప్లాంటును సందర్శించిన సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్‌కు అధికారులు సంఘం సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా పూల మొక్కను అందజేశారు. అధికారులకు చెల్లించాల్సిన పీఆర్సి బకాయిల గురించి సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతులా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఆకస్మికంగా సందర్శించారని అన్నారు. ఎన్ బలరాం, సింగరేణి సంస్థ సీఎండీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఉద్యోగులకు, కాంట్రాక్టు వర్కర్‌లకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. వాటిలో ఉద్యోగులకు ఒక కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగులకు వారి డిపెండెంట్‌లకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో హైదరాబాదులో సింగరేణి సూపర్ మిగతా 2లో..



# నాడు పచ్చని స్వప్నం... నేడు ఎండిపోతున్న జ్ఞాపకం..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం పల్లె ప్రకృతి వనాలు జిల్లాలో పలు చోట్ల నిరక్ష్యాన్లికి గురవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నీరు లేక చెట్లు ఎండిపోతున్నాయి. నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడం, పంచాయతీల వద్ద నిధుల కొరత, పర్యవేక్షణ లోపం కారణంగా పల్లె ప్రకృతి వనాలు తమ అసలు ఉద్దేశాన్ని కోల్పోతున్నాయి. చాల చోట్ల వనాలు మేత స్థలాలుగా మారిపోయిన దృశ్యాలు కనిపిస్తుండగా, కొన్ని చోట్ల చుట్టూ నిర్మించిన కంచెలు, గోడలు కూలిపోయి, ద్వారాల గేట్లు విరిగిపోయి పాడుబడిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రమే చెట్లు పెద్దగా పెరిగి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ నిర్వహణలో నిలబడి పచ్చదనాన్ని చాటుతున్నాయి.

### ప్రభుత్వం,ఉన్నతాధికారులు ప్రకృతి వనాల రక్షణకు చర్యలు తీసుకోవాలి ...

నిరక్ష్యపు నీడలో మనుగడ ప్రశ్నార్థకం అవుతూ నీరుగార్చుతున్న ప్రకృతి వనాలను రక్షించేందుకు ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవతో చర్యలు తీసుకోవాలి నిధులు కేటాయించి పంచాయతీ సిబ్బందితో పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి అని ప్రజలు కోరుతున్నారు.

### పల్లె ప్రకృతి వనాలను ఉపాధి హామీ పథకంతో అనుసంధానించాలి ...

పల్లె ప్రకృతి వనాలు పర్యావరణ రక్షణకు, ఉపాధి హామీ పథకం గ్రామీణ అభివృద్ధికి, ఈ రెండింటిని కలిపితే పచ్చదనం, ఉపాధి, ఆర్థిక స్థిరత్వం అనే మూడు లక్ష్యాలు ఒకేసారి సాధ్యమవడానికి అవకాశం ఉంటుంది. ప్రతి పల్లె ప్రకృతి వనంలో కనీసం ఇద్దరు లేదా ముగ్గురు స్థానిక కూలీలను ఉపాధి హామీ పథకం ద్వారా నియమించాలి.

దింతో చెట్లకు నీరు పోయడం, నీటి గుంటలు, పూల తోటలు నిర్వహించడం వంటి పనులు క్రమం తప్పకుండా జరుగుతాయి. పర్యావరణ రక్షణతో పాటు గ్రామీణ ఆర్థిక స్థితి మెరుగుపరిచే మార్గం అవుతుంది. భవిష్యత్ దిశ...పల్లె ప్రకృతి వనాలు గ్రామాల ప్రాణశక్తికి ఊపిరి కేంద్రాలు పచ్చ తెలంగాణ కలకు ప్రతీక. వాటి క్షీణత కేవలం పచ్చదనానికి కాదు, భవిష్యత్ లో గ్రామాల ఉష్ణోగ్రతలు, వర్షపాతం, గాలి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం, అధికారప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి ముందడుగు వేస్తే మళ్లీ వనాలు పల్లె పసిడి ఆభరణాలుగా మారతాయి.

### అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టాలి



**- సోయం గంగారాం,సిర్పూర్ (యు) కోహినూర్ (బి) సోయం గూడా**

పల్లె ప్రకృతి వనాలు ఉంటె వాతావరణం చల్లగా ఉంటుంది. కానీ ఇప్పుడు నీరు లేక చెట్లు చనిపోతున్నాయి. వనాల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి వనాలను రక్షి ంచాలి.

### ఉపాధిహామీ పథకంతో అనుసంధానించి నిధులు కేటాయించాలి



**- మేకల శేఖర్,పెంచికల్ పేట్**

ఉపాధి హామీ పథకంతో అనుసంధానించాలి. వనాలు ఎండిపోవడం చూస్తుంటే భాదగా ఉంది. ఉపాధిహామీ పనుల్లో వనాల సంరక్షణను చేర్చితే మాకు పని వస్తుంది. చెట్లు బతుకుతాయి.

## సింగరేణి అధికారుల సమస్యల పై సానుకూలంగా స్పందించిన సీ అండ్ ఎం.డీ

(మొదటిపేజీ తరువాయి)

స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నరన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం, స్పెషల్ ఇన్సెంటివ్ అందించడంతో పాటు ఈ.ఎస్.ఐ పథకం అమలు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే పవర్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల కోసం సీబీఎస్సీ పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. ఇటీవల సిబీఎస్సీ పాఠశాల అనుమతి లభించింది దానిని వచ్చే సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అధికారుల సమస్యలపై కూడా సీఎండి ఎన్ బలరాం, ఐఆర్ఎస్ సానుకూలంగా స్పందించి అధికారులకు చెల్లించాల్సిన పిఆర్పి గురించి మంచి నిర్ణయం త్వరలో తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఎస్టిపిపి అధికారుల సంఘం అధ్యక్షులు డి పంతులా వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి పంతులా మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం అధికారులకు 2022-23,2023-24 ఆర్థిక సంవత్సరాలకు రావాల్సిన పీఆర్పీబకాయిలను వెంటనే చెల్లించాలని కోరడం జరిగింది. అలాగే 2007 నుండి 2014 వరకు పెండింగ్‌లో ఉన్న సింగరేణి అధికారుల పీఆర్పీ బకాయిలను చెల్లించాలని హై కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. వాటిని కూడా త్వరగా చెల్లించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలతో ఎన్.సీ.డబ్ల్యూ,ఏ కార్మికుల పిల్లలు ఐఐటి/ఐఐఎంలో సీటు పొందితే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ఉచిత విద్యుత్ అందజేయడం జరుగుతున్నదని, కానీ అధికారుల పిల్లలకు అలా ఇవ్వడం లేదని అన్నారు. కాబట్టి ఇక నుండి అధికారుల పిల్లలు ఐఐటి/ఐఐఎంలో సీటు పొందితే వారికీ కూడా ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అధికారులందరూ తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి 100 కృషి చేస్తున్నారని, పీఆర్పీ విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లయితే వారు నూతన ఉత్సాహంతో మరింతగా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం అధికారుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం ఎస్టిపిపి ఎం నరసింహారావు, జీఎం(పిసిఎస్) అండ్ (ఓ అండ్ ఎం) మదన్మోహన్, కార్యవర్గ సభ్యులు సిఎంఓఎఐ బ్రాంచ్, సెక్రటరీ సంతోష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్1 జనగామ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, కేవి శ్రీనివాస్, రమేష్, జాయింట్ సెక్రటరీ శ్యామల, మోబిన్, ఠాకూర్ మోహన్ సింగ్, బి. శంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం.. ఎక్కడి చెత్త అక్కడే..!

(మొదటిపేజీ తరువాయి)

చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి రహదారులు కంపు కొడుతున్నాయి. చెత్తా చెదారంలో పందులు, కుక్కలు, పశువులు తిరుగుతుండడంతో దోమల బెడద అధికమైందని అంటు వ్యాధులు, జ్వరాలు బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సింగరేణి ఉన్నత అధికారులు స్పందించి పారిశుధ్య పనులపై దృష్టి సారించి రోడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## న్యాయం అందరికీ చేరేలా చర్యలు అవసరం

**- రాజలింగు మోతె**



**రామకృష్ణాపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త**

జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా రామకృష్ణాపూర్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజలింగు మోతె మాట్లాడుతూ, న్యాయ సేవలు బలహీన వర్గాలకు సులభంగా అందేలా అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆరుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

పేకాట ఆడుతున్న ఆరుగురిని జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం కాగజ్‌నగర్ మండలంలోని బోరిగాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుండి 2,890 నగదు,52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకొని కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పేకాట, ఇతర అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ హెచ్చరించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఎస్సై రాజు కందూరి,హెడ్ కానిస్టేబుల్ మహమూద్,పోలీస్ కానిస్టేబుల్స్ విజయ్,రమేష్,హోంగార్డ్ శేఖర్‌లు పాల్గొన్నారు.



పట్టుబడిన వ్యక్తులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు



మాదారంలో నిర్వహిస్తున్న నగర సంకీర్తన

## భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

**తాండూర్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం టౌన్ షిప్ లో కార్తీకమాసం పురస్కరించుకొని గత 19 రోజులుగా భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తనను మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గత నెల 22న వేద పండితులు ముద్దు అవధూత శర్మ శ్రీ కోదండ రామాలయంలో వేకువ జామున 5 గంటలకు వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించి నగర సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీసీతారామ,లక్ష్మణ, ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణుడు ప్రతిమలతో కాలనీలు,పురవీధుల గుండా నిర్వహిస్తున్న నగర సంకీర్తనకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ పూజలు చేస్తున్నారు. కోదండ రామాలయం,భూలక్ష్మి మ్మ,శివాలయం,శ్రీ వృక్ష వరసిద్ధి వినాయక స్వామి, పోచమ్మ,పెద్దమ్మతల్లి నుండి రామాలయం చేరుకుంటుంది. మేళా తాళాలు మధ్య భజనలు, కీర్తనలు, భగవాన్ నామస్మరణలతో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయాల చుట్టూ ప్రదక్షి ణలు చేసి భక్తులు దీపారాధన చేస్తున్నారు. ప్రతిరోజు వేకువజామున నగర సంకీర్తన నిర్వహిస్తుండడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈనెల 21 తేదీ మార్గశిర పాడ్యమి వరకు నగర సంకీర్తన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## వేలాల గుట్టపై గిరి ప్రదక్షిణ

**జైపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త**



వేలాల గ్రామం గట్టు మల్లన్న ఆలయం గుట్టమీద ఆదివారం చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా చేపట్టిన గిరి ప్రదక్షిణ ఉదయం 9 గంటలకు ప్రారంభం అయింది. వివిధ గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు సామూహిక శివనామస్మరణ మధ్య గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు.

## టిఎస్యూటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

**ఆసిఫాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త :**



టిఎస్యూటిఎఫ్ ఆసిఫాబాద్ నూతన మండల కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊషన్న అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సంఘం మండల అధ్యక్షులుగా కోట తిరుపతి ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా డివిఎన్ మూర్తి, కోశాధికారిగా బాదిరావ్, ఉపాధ్యక్షులుగా ఆరిఫ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా అనిత, కార్యదర్శులుగా చైతన్య, నరేష్, దేవాజి, పృథ్వి, నగేష్, సంతోష్, కన్వీనర్ గా అనిత, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా రజిత, సంతోష్లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటిఎఫ్ ముందుంటుందని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు సంఘం బలోపేతంతో పాటు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల చురుకుగా వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# జైపూర్ ఎస్టీపీపీని సందర్శించిన సింగరేణి సీఎండీ

**జైపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్ ఈ అండ్ ఎం తిరుమల రావు సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈ.డి చిరంజీవి, జి.ఎం నరసింహారావులు సిఎండి ఎన్ బలరాంకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎండి బలరాం, ప్లాంట్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం 800 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మూడో యూనిట్‌కి సంబంధించి భూమి పూజ ఉండబోతుందన్నారు. అధికారులు అన్ని రకాలుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మూడవ ప్లాంట్‌ను సకాలంలో పూర్తిచేసేలా ప్రణాళికలు చేయాలనీ అధికారులను ఆదేశించారు. అనంతరం మిథనాల్ ప్లాంట్‌ను కూడా సందర్శించి మిథనాల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకున్నదని, ప్రస్తుతం ట్రయల్ రన్ చేపడుతున్నారని మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు. అనంతరం నీటి బిందువు జల సింధువు కార్యక్రమంలో భాగంగా ఎస్టిపిపిలో నిర్మించిన నీటి కుంటలను పరిశీలించారు. ఐదు నీటి కుంటలను నిర్మించగా నేడు అవి జలకళతో నిండుకుండలా కనిపిస్తున్నాయనీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో (పి.సి.ఎస్ అండ్ ఓ అండ్ ఎం) జీ.ఎం మదన్మోహన్, (ఇ అండ్ ఎం) సోలార్ ఏ.జి.ఎం శ్రీనివాస్, సి.ఎం.ఓ.ఎ.ఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి వంతులా, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, ఇతర ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ముగిసిన అడెల్లి పోచమ్మ విగ్రహ పున:ప్రతిష్టాపన కార్యక్రమాలు

**సారంగాపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి పోచమ్మ విగ్రహ పున:ప్రతిష్టాపన కార్యక్రమాలు ఈ నెల 3న ప్రారంభమై ఆదివారం ముగిసాయి. అమ్మవారికి బలి కార్యక్రమంలో భాగంగా పోతరాజులను అమ్మవారికి మేకలను బలి ఇచ్చి, గావు పట్టడం జరిగింది. దీనితో అమ్మవారి దగ్గర అందరు పండుగలు చేసుకోవడానికి అనుమతి లభించింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం పండుగలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భోజగౌడ్, కార్యనిర్వాహకారి భూమయ్య, ఆలయం ధర్మకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## అడెల్లి మహా పోచమ్మ తల్లికి వెండి కిరీటం బహుకరణ

**సారంగాపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రతిష్ఠించబడిన అమ్మవారి విగ్రహానికి చింతాకుల రాజేశ్వర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, కుమార్తెలు శ్రీలత, వెంకటేష్ గౌడ్, సుమలత శ్రీనివాస్, ప్రేమలత శరత్‌గౌడ్ అమ్మవారికి వెండి కిరీటాన్ని ఆలయ చైర్మన్ భోజగౌడ్, ఈఓ భూమన్న సమక్షంలో సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుచరిత రాజేశ్వర్‌రావు, మాజీ అడెల్లి చైర్మన్ ఉట్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

### మరొకరి పరిస్థితి విషమం

**ఆదిలాబాద్, నవంబర్ 09, ప్రభాతవార్త:**

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన మండలంలోని అంకోలి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంకోలి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు ఎదురెదురుగా బైక్లు వచ్చి ఢీకొన్నాయి. ఇందులో ఇద్దరికి గాయాలు కావడంతో వెంటనే రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్, హైదరాబాద్ తరలిస్తుండగా దార్‌లోద్దికి చెందిన కుమ్రం వంశీ(20) మృతి చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు.

## కనకదుర్గమ్మకు మొక్కులు చెల్లించిన భక్తురాలు

**బజార్‌హత్నూర్, నవంబర్ 09, ప్రభాతవార్త:**



మండలంలోని గిర్నూర్ గ్రామం సమీపంలో కనక దుర్గమ్మకు సోనాల కు చెందిన భక్తురాలు ఆదివారం మొక్కు తీర్చుకున్నారు. ఈ రోజు దుర్గమ్మ వార్షికోత్స వ వేడుకలు జరుగుతున్న సందర్భంగా సోనాల మండలానికి చెందిన బ ో ం ు న ్ ్ ల్ల రాములు,లక్ష్మి గార్ల కుమార్తె అయిన బోయినపల్లి జ్యోతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ ఉద్యోగం రావడంతో వారు కనక దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి, ఒక తులం బంగారాన్ని మొక్కుగా చెల్లించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గవ్వల దేవేందర్, సోన్న నారాయణ,మాడిగే జెలందర్,గ్రామ కమిటీ అధ్యక్షులు కతుపూర్ మహేందర్,దిలీప్,లింగయ్య, జైపాల్,భీమేష్,లక్ష్మణ్, ఆదిలాబాద్ జిల్లా గౌరెల సహకార సంఘం అధ్యక్షుడు గవ్వల సాయి చైతన్య యాదవ్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు క్రీడారంగంలో విజయ కిరీటం

### ఛాంపియన్లుగా నిలిచిన విద్యార్థినులు

**ఆదిలాబాద్, నవంబర్ 09, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ పట్టణంలోని ఎంజెపి (బాలికల) పాఠశాలలో నవంబర్ 6 నుంచి 8 వరకు జరిగిన ఎంజెపి సొసైటీ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఆసిఫాబాద్ ఎంజెపి (బాలికల) పాఠశాల బాలికలు అద్భుత ప్రతిభ ప్రదర్శించి మొత్తం చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. బాలికలు వివిధ క్రీడా విభాగాలలో తమ ప్రతిభను చాటుతూ పాఠశాల పేరు జిల్లావ్యాప్తంగా గర్వంగా నిలిపారు. ఈ విజయంతో ఆసిఫాబాద్ విద్యార్థినులు తమ కృషి, నిబద్ధతను మరోసారి నిరూపించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి. సుకన్యా, పీఈటీ ఫౌజియా, సైన్స్ ఉపాధ్యాయురాలు సంగరత్న బాలికలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ విజయంతో ఆసిఫాబాద్ పాఠశాల పేరు జిల్లాలో గర్వకారణంగా నిలిచింది. క్రీడా రంగంలో బాలికల ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాయి.





## జూబ్లీహిల్స్‌లో ఆత్రం సుగుణ ప్రచారం

**ఉట్నూర్, నవంబర్ 09, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం ఊపందుకుంటోంది. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణ అక్క స్థానిక నాయకులతో కలిసి బోరబండ డివిజన్‌లో ప్రచారం చేపట్టారు. మహిళలతో కలిసి సుగుణ అక్క ఇంటింటా ప్రచారం చేస్తూ ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటేయాలని కోరారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఆ ఇంటికి విద్యుత్ వెలుగులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా, ట్రాఫిక్ రహిత రాజధానిగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపక నియమకానికి దరఖాస్తులు ఆహ్వానం

**మంచిర్యాల, నవంబర్ 09, ప్రభాతవార్త:**

గురుకుల డిగ్రీ కళాశాల (మంచిర్యాల)లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సిఓ సేరు శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. (వృక్ష శాస్త్రం) 01 (గంటల ఆధారంగా ) ఖాళీగా ఉన్నాయని సంబంధిత సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులు కలిగి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 11వ తేదీన మంచిర్యాల జిల్లాలో నిర్వహించబడుతున్న పురుష డిగ్రీ కళాశాలలో జరిగే డెమోకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఒరిజినల్, జిరాక్స్ ధ్రువపత్రాలతో హాజరు కాగలరు. ఇతర వివరాల కోసం 9603705803, 8977568214 సంప్రదించాలని కోరారు.

## మాజీ మంత్రిని కలిసిన ఉట్నూర్ నాయకులు

**ఉట్నూర్, నవంబర్ 09, ప్రభాతవార్త:**



ఉట్నూర్ మండల బిఆర్ఎస్ నాయకులు ఆదివారం మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి ఉట్నూర్ సమస్యలను వివరించారు. మాజీ మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పంద్ర జైవంత్‌రావు, నాయకులు దుట మహేందర్, మాజీ ఉపసర్పంచ్ సత్యన్నా, అజ్మీరా జయచంద్ర, గవస్కర్, సాహజిత్ తదితరులు పాల్గొన్నారు.

# మాలి కులస్థులకు ఎస్టీ హోదా సాధించడమే అంతిమ లక్ష్యం..

★ సిర్పూర్ నియోజకవర్గనికి నికార్సైన నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ★ రాష్ట్ర నియోజకవర్గాలలో మొదటి స్థానం.. అభివృద్ధిలో అట్టడుగు స్థానం

★ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ★ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యామ్‌రావు






**కాగజ్‌నగర్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్రంలోని గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నివాసముంటున్న మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించడమే అంతిమ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యామ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల జనాభా ఉన్నట్లు తెలిపారు. ఇందులో సిర్పూర్ నియోజకవర్గం లో అత్యధికంగా ఉన్నారని నియోజకవర్గంలో సుమారు 35 వేల ఓట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. మాలి కులస్తులు సామాజికంగా, రాజకీయంగా, ఉద్యోగ, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ప్రభుత్వం వెంటనే ఎస్టీ జాబితాలో చేర్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పక్కన ఉన్న ఏపీ రాష్ట్రంలో ఎస్టీ జాబితాలో ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ(డి)గా కొనసాగుతున్నట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు, వైయస్సార్ హామీలు ఇచ్చారని కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక కెసిఆర్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించడం జరిగిందని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించేంతవరకు నా పోరాటం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.



## సామాజిక చేయుత..

సామాజికంగా మాలి కులస్తులకు ఏ అవసరం వచ్చిన నేనున్నానని చేయూతనిస్తున్నారు శ్యామ్ రావు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఆసుపత్రిలో చికిత్స అందించుట కొరకు తన వంతుగా ఆర్థిక సహాయం అందించడం, ప్రమాదంలో ఇల్లు కాలిన వారికి కుటుంబాలకు చేయూత ఇవ్వడం, పిడుగు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం, నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయాన్ని అందించడం, పేద విద్యార్థులకు గురుకులాల్లో సీటు కల్పించడానికి కృషి చేయడం, గ్రామీణ యువకులకు క్రీడలలో ప్రోత్సహించడం, యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ కల్పించడానికి తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారి పెళ్లి ఖర్చులకు సైతం చేయూతనిస్తున్నారు.





## రాజకీయపరంగా..

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడకు గతంలో ఎంపీటీసీగా వ్యవహరించినట్లు ఆయన అన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గానికి బిఆర్ఎస్ పార్టీ నుంచి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బాట నడుస్తున్నారు. ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కేవలం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వల్లే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. పోలీస్ శాఖలో ఉన్నత పదవులు పొంది పేద ప్రజలకు తనవంతుగా సహాయం చేయడానికి రాజకీయంగా ముందుకు వచ్చిన నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని అన్నారు.





ఎలాగైనా ఈ సారి సిర్పూర్ నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపించి తీరుతామని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా సామాజికంగా అభాగ్యులకు చేయూతనిస్తున్న శ్యామ్ రావు మరింత సామాజిక కార్యక్రమాలకు చేయూతనివ్వాలని ఆశిద్దాం.







## క్రీడల్లో బాలికల హవా

**ఆసిఫాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల చెందిన విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. ఇటీవల అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా అండర్ 17 విభాగంలో క్రీడాకారులు ఆయా క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరచడంతో పాటు ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు పిఈటి ఫౌసియా తెలిపారు. వాలీబాల్ లో స్మృతి, ఖోఖో లో కావ్యశ్రీ, కబడ్డీ లో వైష్ణవి టీములు ఫస్ట్ ప్రైజ్ సాధించగా చెస్ లో సహస్ర, డిస్క్ లో హిమబిందు ప్రథమ స్థానం నిలిచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. రన్నింగ్ లో బిక్కుబాయి,షార్ట్ ఫుట్ లో సుజాత ద్వితీయ స్థానంలో నిలిచారు. కావ్యశ్రీ , నిత్యశ్రీ, కీర్తన, సరిత ఖోఖో క్రీడలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినీలను ప్రిన్సిపాల్ సుకన్య, గురుకుల పాఠశాల అధ్యాపకురాల్లు అభినందించారు.



## ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

### - 5కె రన్‌ఫర్ అరెస్పీ పోస్టర్ ఆవిష్కరణ

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త :**

ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఇండియా ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఆదివారం నాడు ఉదయం 6గంటలకు నిర్వహించే 5కె రన్‌ఫర్ అరెస్పీ పోస్టర్‌లను కాగజ్‌నగర్ టౌన్ ఎన్టీఆర్ చౌరస్తాలో ఫిట్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు ఆరెస్పీ అభిమానులు,పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య భారత్ నిర్మాణమే లక్ష్యంగా ఏ ఒక్కరు అనారోగ్య బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా, రన్ రీడ్ లీడ్ లక్ష్యంగా కార్యక్రమంలు ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తామని అన్నారు. అందులో భాగంగా 5కె రన్‌ఫర్ అరెస్పీ పేరుతో ఏస్పీఎం గ్రౌండ్ నుండి మొదలై ముగింపు కూడా అక్కడే ఉంటుందన్నారు. రన్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికి టీ షర్ట్ మెడల్‌తో పాటు మొదటి స్థానంలో నిలిచిన ముగ్గురికి బహుమతులు ఇవ్వడం జరుగుతుదని, ఇతర వివరాలకు 9493900100,9848272929 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు ఆరెస్పీ అభిమానులు,పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలి

### - టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్,ఎస్ సంపత్ కుమార్





**కెరమెరి, నవంబర్ 9, ప్రభాతవార్త :**

జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్ , ఎస్ సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం కెరమేరిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద సంఘ ఇండియన్ జర్నలిస్ట యూనియన్‌కు అనుబంధంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జర్నలిస్టుల సభ్యత్వం కలిగిన యూనియన్ గా టియూడబ్ల్యూజే గుర్తింపు పొందిందని అన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు,అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. జర్నలిస్టులకు అనారోగ్య, ఇతర ఎలాంటి సమస్యలు ఎదురైనా యూనియన్ అండగా ఉంటుందని గుర్తు చేశారు. జర్నలిస్టులు అవినీతికి తావు లేకుండా విలువలతో కూడిన జర్నలిజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను జర్నలిస్టులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కోశాధికారి అడప సతీష్,జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాందాస్,పాత్రికేయులు సంజీవ్,వెంకటస్వామి,ఎజాస్,బాలాజీ,పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

**లింగాపూర్, నవంబర్ 09, ప్రభాతవార్త :**

జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా టియూడబ్ల్యూజే పోరాటం చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలోని ఏ ఎం సి కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జైనూర్,సిర్పూర్ యు,లింగాపూర్ మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ జర్నలిస్టులకు సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద సంఘు ఇండియన్ జర్నలిస్ట యూనియన్‌కు అనుబంధంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జర్నలిస్టుల సభ్యత్వం కలిగిన యూనియన్ గా టియూడబ్ల్యూజే గుర్తింపు పొందిందని అన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు, అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. జర్నలిస్టులకు అనారోగ్య, ఇతర ఎలాంటి సమస్యలు ఎదురైనా యూనియన్ అండగా ఉంటుందని గుర్తు చేశారు. జర్నలిస్టులు అవినీతికి తావు లేకుండా విలువలతో కూడిన జర్నలిజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను జర్నలిస్టులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కోశాధికారి అడప సతీష్,జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు నరేందర్,షేక్ జమిల్,అన్నరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు రాందాస్, రామేశ్వర్, పాత్రికేయులు ఆసిఫ్,ప్రకాష్, రవి, షర్ఫుద్దీన్,శంకర్,ఆత్రం రాము,మనోజ్,శ్రావణ్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆదివాసి రిపోర్టర్‌కు ఆర్థికసాయం అందజేత..**

జైనూర్ మండలంలోని పట్నాపూర్‌కు చెందిన ఆదివాసి రిపోర్టర్ ఆత్రం రాము గత కొంత కాలంగా అనారోగ్యంతో గురైన విషయాన్ని తెలుసుకొని అతనికి వైద్య చికిత్స నిమిత్తం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 5000 రూపాయలు నగదు ఆర్థిక సహాయం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్అందజేశారు. ఆత్రం రాముకు తమ యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు.

## ఘనంగా కనక దుర్గ ఆలయ వార్షికోత్సవ మహోత్సవం

**బజార్ హత్నూర్, నవంబర్ 09, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని గిర్నూర్ గ్రామ సమీపంలో ఉన్న పురాతన కనక దుర్గ ఆలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే ఈ ఉత్సవానికి ప్రాంతం నలుమూలల నుండి భక్తులు, సందర్శకులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తుల నినాదాలతో మార్మోగింది. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం కార్యక్రమాలతో ఉత్సవం వైభవంగా కొనసాగింది. ఇక్కడి మరో ఆకర్షణీయ అంశం కనుకాయి జలపాతాలు. ఆలయ సమీపంలోని ఈ జలపాతాలు తమ అద్భుత సౌందర్యంతో పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. కనక దుర్గమ్మ ఆలయం సమీపంలో ఉండటంతో ఈ జలపాతాలకు "కనుకాయి" అని పేరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాదు జిల్లా ప్రధాన కేంద్రం నుండి సుమారు 47 కిలోమీటర్ల దూరంలో, నిర్మల్ నుండి 59 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రదేశం వీకెండ్ ట్రిప్‌కి సరైన గమ్యస్థానం. గూగుల్ ట్రాకింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉండటంతో పర్యాటకులు సులభంగా చేరుకోగలరు. ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి రావచ్చేలా పర్యటనను ప్లాన్ చేసుకోవచ్చు. చుట్టూ పచ్చని పంటలు, దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు సహజ సౌందర్యాన్ని మరింత ఆహ్లాదకరంగా మారుస్తాయి. దాదాపు 30 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పులో జాలువారే ఈ జలపాతాలు చూసిన వారిని మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. భక్తి, ప్రకృతి, పండుగ కలిసిన ఈ ప్రదేశం ఇప్పుడు ఉత్తర తెలంగాణలోని అత్యంత ఆహ్లాదక పర్యాటక కేంద్రముగా రూపుదిద్దుకుంటోంది.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**సిర్పూర్ (టి), నవంబర్ 9, ప్రభాతవార్త :**



ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాము చదువులమ్మ చెట్టు నీడలో విడలేమంటూ వీడ్కోలంటూ వెళ్లిపోతున్నాము. చిలిపితలపు చివరి మలుపులో అంటూవిడిపోయిన 1990-1991 సిర్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం రోజున సిర్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా జరిగింది. 34 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు పూర్వ గురువులు ఒకే వేదికపై కలిసి ఆనాటి తీపి జ్ఞాపకాలు పంచుకున్న వైనం అద్భుతంగా ఆకట్టుకుంది. ఆనాటి చిన్ననాటి విద్యార్థి దశ చిలిపి చేష్టలు పూర్వ విద్యార్థులు పూర్వ గురువులు తోకలిసి తీపి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆనాటి పూర్వ విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడి ఎంతోమందికిస్ఫూర్తి ఇచ్చిన వారి అనుభవాలు అనుభూతులు ఈ సందర్భంగా పంచుకున్నారు. పూర్వపు గురువులు సైతం ఆనాటి పూర్వ విద్యార్థుల క్రమశిక్షణ గురించి ప్రశంసించారు.గురువు అనే పదానికి వన్నె తెచ్చిన ఆనాటిపూర్వ గురువుల ఉత్తమ ప్రతిభ ఉన్నత విలువలతో కూడిన బోధన విధానాలను పూర్వ విద్యార్థులు గుర్తుచేసుకొని ప్రశంసలతో కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పూర్వ గురువులైన మల్లయ్య బట్, దిగంబర్ రావు, కిష్టయ్య,శ్యామ్‌సుందర్,జగదీష్,శాంత,ధనలక్ష్మి ప్రత్యేక మెమొంటోలతో పాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 34 సంవత్సరాల పూర్వ విద్యార్థుల సమ్మేళన వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వహణ కమిటీ అధ్యక్షులు దిండు కరుణాకర్ గౌడ్ సభ్యులు నగరాడ రాజు శ్రీనివాస్ ఇలియాస్ అంకులు శేఖర్ నారాయణ అమర జ్యోతి వైశాలి వనజ వీణ విమల గురువులు ప్రతి ఒక్కరు అభినందించారు.